పార్లమెంట్ ఎన్నికలకు సర్వసన్నద్ధం

కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మార్చి 15: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అధికారులు, ఉద్యోగులకు రెండు దశల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలల్లో సౌకర్యాల మెరుగునకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఓటర్ల జాబితా నవీకరణలో భాగంగా 29,745 ఓట్లను తొలగించామన్నారు. ముందస్తుగా నోటీసులు ఇచ్చిన తర్వాతనే ఓట్లను తొలగించినట్లు చెప్పారు.

కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ప్రశంస

నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగును సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించామన్నారు. ఈ కెమెరాలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, హైదరాబాద్‌లోని ప్రధాన ఎన్నికల అధికారి, ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల అధికారి కార్యాలయాలకు అనుసంధానించినట్లు చెప్పారు. ఇలా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఢిల్లీ వరకు అనుసంధానించడం అనేది మొట్టమొదటిసారిగా ఖమ్మం జిల్లాలోనే జరిగిందంటూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రశంసించిందని

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

చెప్పారు. ఈ విధానాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. ''ఇక్కడి విధానాన్ని దేశం అనుసరించడం మన జిల్లాకు గర్వకారణం'' అన్నారు..

మూడు నెలలపాటు నీటి పొదుపు

జిల్లావ్యాప్తంగా మూడు నెలలపాటు (జూన్ 30 వరకు) ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని కలెక్టర్ సూచించారు. పాలేరు రిజర్వాయర్‌లో నీరు మరో పది రోజుల వరకు మాత్రమే సరిపోతుందన్నారు. నాగార్జున సాగర్ జలాశయం నుంచి తాగు నీటిని తీసుకునేందుకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ) అనుమతి అవసరమవుతుందని చెప్పారు. మిషన్ భగీరథ పథకాలు పనిచేస్తున్నాయన్నారు.

28న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్, మార్చి 15: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న జరుగుతాయని ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న పరిశీలన, 22న ఉపసంహరణ-జాబితా విడుదల, 28న పోలింగ్-లెక్కింపు-ఫలితాల వెల్లడి ఉంటుందని వివరించారు.

రేపు 'పాలేరు' లో పొంగులేటి పర్యటన

ఖమ్మం, మార్చి 15: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం పాలేరు నియోజకవర్గంలో పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చెక్కుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

గొర్రెల డీడీ కట్టిన వారు 18న కలెక్టరేట్‌కు రావాలి

పెనుబల్లి, మార్చి15: గొర్రెల పంపిణీ పథకంలో డీడీలు కట్టిన వారు, బీ లిస్ట్‌లో ఎంపికైన యాదవ, కురుములు ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు రావాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతి రావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంసూరు, మార్చి 15: బీరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బీరాపల్లి, మోద్దులగూడెం, గూడూరు, శంభునిగూడెం, మల్లెల, కొండిగట్ల, గొల్లగూడెం, జయలక్ష్మీపురం, నాయకునిగూడెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని గూడూరు ఏఈ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

సత్తుపల్లి టౌన్, మార్చి 15: ప్రజాసమస్యలు, అభివృద్ధికి సంబంధించి తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరేలా పూర్తిచేయాలని సూచించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం బ్రాంచ్**-2 వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **సూరపనేని నవనీత**, D/o : **కుమార్**, **వయస్సు** : 25 సం॥లు, **వృత్తి** : ఎంప్లాయి, **నివాసం** : ఇ.నెం. 3-150, గోపాలపురం, ఖమ్మం నగరం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా, ఖమ్మం సబ్ జిల్లా ఖమ్మం అర్బన్ మండలం, లోగో ఖమ్మం జిల్లా, ఖమ్మం అర్బన్ మండలం వేలుగుమట్ల గ్రామ పంచాయితీ వెలుగుమట్ల గ్రామ ఖంఠము పరిధిలో గల (ప్రస్తుత ఖమ్మం నగర మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో కలదు) L.B. Nagar Colony-II నందు A.C. Sheet Roof House భూమి స్థల యుక్తముగా పాత ఇ.నెం. 4-109/1, కొత్త ఇ.నెం. 16-6-63 గల మొత్తం విస్తీర్ణం : 72.00 చ॥గ॥ = 60.20 చ॥మీ॥ నిర్మాణ వైశాల్యము : A.C. Sheet Roof House : 300.00 Sq.Feets, A.C. Sheet Roof Toilet : 39.96 Sq.Feets అందు గల విద్యుత్ ఫిట్టింగ్స్ మరియు ఫిక్చర్స్ యుక్తముగా **డాక్యుమెంట్ నెం. 1919/2024**గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు** : House of G.Venkateswarlu, H.No. 16-6-64/1, **పడమర** : Municipal Corporation Road, **ఉత్తరం** : Open Place of B.Balakrishna, **దక్షిణం** : House of B.Ramesh.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

'టెన్త్' విద్యార్థులకు వీడ్కోలు

సత్తుపల్లి రూరల్, మార్చి 15: మండలంలోని గంగారం ఎస్‌డీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. పది ఫలితాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5వేలు, ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులకు రూ.10వేలు ప్రోత్సాహకాలు ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, థామస్, ప్రభాకర్, ఉదయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కవిత అరెస్ట్

ఖమ్మం, మార్చి 15: బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఎంపీ వద్దిరాజు రవిచంద్ర , బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్‌సీ తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఈడీ సోదాల పేరుతో కవితను రాజకీయ కక్షతోనే బీజేపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని తెలంగాణ ప్రజలు అనుమానిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అరెస్ట్ ద్వారా తెలంగాణ సాధకుడు కేసీఆర్ మనోధైర్యాన్ని ఇంచు మందం కూడా కదిలించలేరని వ్యాఖ్యానించారు. కవితకు యావత్ తెలంగాణ సమాజం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

తుమ్మలనగర్ వాసులకు మంచినీళ్లు ఇవ్వండి

సత్తుపల్లి రూరల్, మార్చి 15: మండలంలోని చెరుకుపల్లి, తుమ్మలనగర్ వాసులకు మంచి నీరు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మట్టా రాగమయికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెరుకుపల్లిలో సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ తుమ్మల నగర్‌లో మంచినీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనులకు ఉండటానికి కనీసం ఇళ్లు లేవని, గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, ఇందిరమ్మ ఇంటి పథకంలో ఇళ్లు ఇవ్వాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న నాయకులు ఆదినారాయణ

స్పందించిన ఎమ్మెల్యే రాగమయి సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాటి వీరభద్రం, గడ్డం కృష్ణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓ ఫలితాల్లో మనోళ్ల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 15: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షలో మనోళ్లు ప్రతిభ చాటారు. నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పూజిత, తేజస్వి ల్యాప్‌టాప్‌లు సాధించినట్లు ప్రిన్సిపాల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థులను చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మాధుర్ అభినందించారు.

నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్‌లో..

నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ జూనియర్ సైన్స్‌లో రాష్ట్ర కోటా కింద నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థి కృష్ణమాధుర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విద్యార్థిని కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎంపీ నామా జన్మదిన వేడుకలు

సత్తుపల్లి, మార్చి 15: ఖమ్మం లోక్‌సభ పక్ష నేత, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత నామా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను జిల్లాలోనే పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం నిర్వహించారు. సత్తుపల్లిలోని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య క్యాంపు కార్యాలయంలో, మధిర నియోజకవర్గ కార్యాలయంలో, ఎర్రుపాలెం బీఆర్ఎస్ కార్యాలయంలో, వైరా పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ముందుగా నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు పండ్లు, భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, నామా అభిమానులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్, సీపీఎం శ్రేణులు

తిరుమలాయపాలెం, మార్చి 15: మండలంలోని మేడిదపల్లిలో గ్రామ సభ తీర్మాణం లేకుండా కాంగ్రెస్ నాయకుడు ఏకపక్షంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం బీఆర్ఎస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మేడిదపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలు మంజూరు కాగా గ్రామసభలో తీర్మాణం చేయకుండానే కాంగ్రెస్ నాయకుడు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాడని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీవో శేషాద్రికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆల దాసు ఆంజనేయులు, ముదిరెడ్డి లచ్చిరెడ్డి, బండ్ల శ్రీను, సీపీఎం నాయకులు సైదులు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

మధిర, మార్చి 15: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మధిర ఎక్సైజ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా 9 కేజీల గంజాయి బ్యాగుల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తుల సమాచారం లేకపోవడంతో ఆ గంజాయిను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

మామిళ్లగూడెం, మార్చి 15: ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులలకు శిక్షణ కార్యక్రమంలో సీపీ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక సెక్టార్ అధికారికి గరిష్టంగా 12 పోలింగ్ కేంద్రాల కేటాయింపు ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తా..
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం, మార్చి 15: ఖమ్మాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా పనిచేసి నగరాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఖమ్మంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 2, 5, 8, 27, 49, 57 డివిజన్లలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే, 15వ డివిజన్‌లో రూ.2.50 కోట్లతో చేపట్టిన ఖమ్మం - కొదుమూరు నాలుగు లైన్ల రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం వికలాంగుల కాలనీ వద్ద నగరపాలక సంస్థ సిబ్బందికి చెందిన సెప్టిక్ ట్యాంక్ క్లినింగ్ వాహనాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పనులను నాణ్యంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పునుకొల్లు నీరజ, ఆదర్శ్ సురభి, శ్యామ్‌ప్రసాద్, చంద్రమౌళి, రంజిత్, కృష్ణలాల్, కమర్తపు మురళి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, రావూరి కరుణ సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తుమ్మల

ఆటోలను నిర్లక్ష్యంగా నడిపితే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

మామిళ్లగూడెం, మార్చి 15: ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ ఆటోలను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామనరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆటో డ్రైవర్లు, సంఘాల నాయకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ అంతరాయాన్ని నియంత్రించడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్, పాత బస్టాండ్, వైరా రోడ్డు ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించవద్దని, వారితో మర్యాదగా మెలగాలని, అతి వేగంతో నడపొద్దని, ఎక్కడపడితే అక్కడ ఆపొద్దని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే అకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లంతా తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్-ఆర్‌సీ ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలి ప్రమాదాల్లో ఎక్కువగా ఆటోల కారణంగానే జరిగాయని చెప్పారు. ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఎస్సైలు రవి, వెంకన్న, ఆర్ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌లు

బోనకల్లులో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి

బోనకల్లు/ చింతకాని, మార్చి15: బోనకల్లు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యం కోసం పద్మావతి, ఇంటర్‌సిటీ, శాతవాహన రైళ్లను నిలపాలని సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ బర్తేశ్‌కుమార్‌జైన్‌కు అఖిలపక్ష నాయకులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న మూడోలైన్ తనిఖీల్లో భాగంగా ఆయన బోనకల్లు రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. నాగేశ్వరరావు, జనార్దన్‌రావు, పంతు నాయక్, గోపి, సత్యనారాయణ, కోలా వెంకటేశ్వర్లు, వీరభద్రం పాల్గొన్నారు. చింతకాని మండలంలోని పాతర్లపాడు గ్రామ గేటు సమీపంలో అండర్‌పాస్, సైడ్‌డ్రైన్, రైల్వేస్టేషన్‌పై వంతెన తదితర నిర్మాణాలను మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.


రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

జేవీఆర్ కళాశాలలో అవగాహన సదస్సు

సత్తుపల్లి టౌన్, మార్చి 15: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జేవీఆర్ కళాశాల వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు, అధ్యాపకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వినియోగదారుల క్లబ్ కన్వీనర్ తెల్లగొర్ల కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు పానెం రామచందర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్'..

సత్తుపల్లి టౌన్, మార్చి 15: జేవీఆర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్‌మీట్‌ను కళాశాల క్రీడల విభాగం, ఎన్ఎస్ఎస్ మహిళా సాధికారత విభాగాలు శుక్రవారం సంయుక్తంగా నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం అధికారి చింతల అన్వేశ్ ఆదేశాల మేరకు అకౌంట్స్ అండ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ భానుచందర్ సహకారంతో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, నారీశక్తి ఫిట్‌నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు రన్నింగ్, టగ్ ఆఫ్ వార్ క్రీడలు నిర్వహించారు. క్రీడలను సీఐ కిరణ్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ బంగారి, ఎన్ఎస్ఎస్ పీవో ఎం మాధవి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ సుభాషిని, విజయలక్ష్మి, రవికుమార్, మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ కిరణ్

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ఖమ్మం లీగల్,మార్చి 15: జిల్లా కోర్టు ప్రాంగణంలో డిజిటల్ లైబ్రరీని జిల్లా జడ్జి జగ్జీవన్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, బాధ్యులు మాదిరాజు లక్ష్మీనారాయణ, ఎంజె.ప్రవీణ్‌కుమార్, గాజుల అమర్‌నాథ్, కెవివి.లక్ష్మి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవితక్క అరెస్ట్ అప్రజాస్వామికం

వైరాటౌన్, మార్చి 15 : మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అరెస్ట్‌ను వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎన్నికల వేళ హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు అర్థరహిత సత్యాలతో బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, బీజేపీ నీచ రాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో ప్రజలు తిరగబడడం ఖాయమని పేర్కొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

కొణిజర్ల, మార్చి 15 : మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరిశా సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని శుక్రవారం అందజేశారు. హెచ్ఎం అబ్రహం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కారేపల్లి, మార్చి 15 : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి ఉపేందర్ తెలిపారు. మండలంలోని పాతకమలాపురం, గోవిందోతండా, ఎర్రబోడు, తొడిదలగూడెం, కారేపల్లి గ్రామాల్లో శుక్రవారం టీకాలు వేశారు. నెలరోజులపాటు అన్ని గ్రామాల్లో టీకాలు వేయనున్నారు.

వాహనాల తనిఖీ

వైరాటౌన్, మార్చి15 : వైరా రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వాహనాలను మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆచంట వరప్రసాద్ పరిశీలించి వాహన దారులతో మాట్లాడారు. నేటి నుంచి వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ టీఎస్ 04 నుంచి టీజీ 04గా మారిందని తెలిపారు. వాహనాలు కొనుగోలు చేసిన వెంటనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు సభ

వైరాటౌన్, మార్చి 15 : న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో పదిస్టేట్, సీబీఎస్ఈ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పిల్లలు వారివారి తీపి జ్ఞాపకాలను నెరవేరుసుకొని పాటలు, డాన్స్‌లతో కేరింతలు కొట్టి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్లు మురళీకృష్ణ, సుమన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'గురుదత్త' సేవలు విస్తృతం కావాలి

ఖమ్మం, మార్చి 15: గురుదత్త ఫౌండేషన్ సేవలు విస్తృతం కావాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఖమ్మం అర్బన్ మండలం పోలేపల్లిలోని గురుదత్త ఫౌండేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈత మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. గురుదత్త ఫౌండేషన్ వరకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఫౌండేసన్ ఆవరణలో పామాయిల్ మొక్కలు నాటారు. వివిధ శాఖల అధికారులు, ఫౌండేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఖమ్మం రూరల్, మార్చి 15: తాగునీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో ఎస్ కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది భూగర్భ జలాలు పడిపోతున్నాయన్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడ తాగునీటి కొరత లేదన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా జరుగుతుందన్నారు.

శ్రీచైతన్యలో హ్యాకథన్ ప్రోగ్రాం

ఖమ్మం రూరల్, మార్చి 15: మండలంలోని పొన్నెకల్ శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవార